క్లుప్తంగా

ఎన్‌ఎస్‌యూఐ పార్లమెంటరీ సమావేశం

● పాల్గొన్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఎన్ఎస్‌యూఐ మహబూబ్‌నగర్ పార్లమెంటరీ స్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేష్, లలిత్ యాదవ్, కృష్ణవర్ధన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భూత్పూర్: అన్నాసాగర్, భూత్పూర్, జానంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ మధుశాల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 02.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేటి నుంచి ఉర్సు

భూత్పూర్: కొత్త మొల్గరలో ఆదివారం నుంచి రెండురోజుల పాటు హజరత్ మౌలాలీ ముషకల్ కుషా ఉర్సు వైభవంగా జరగనుంది. ఈ మేరకు నిర్వాహకులు ఎం.డీ. జహంగీర్, ఎం.డీ. ముజీబ్, ఎం.డీ అల్తాఫ్‌లు ఓ ప్రకటనలో శనివారం వివరాలు తెలిపారు. ఆదివారం గంధం ఊరేగింపు ఉంటుందని వారు వివరించారు.

అధ్యక్షుడిగా పాపయ్య

మహమ్మదాబాద్: వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ మండల అధ్యక్షుడిగా పాపయ్య గుప్తా ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైరెక్టర్ రామకృష్ణ, ఆర్‌సీ కృష్ణ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు అనంతయ్య గుప్తా, సురేష్, నర్సిములు, వెంకటయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

నవాబుపేట: సిద్దోటం పాఠశాలకు గ్రామస్తులు రూ. 35 వేల విలువైన వాటర్ ఫిల్టర్‌ను వితరణ చేశారు. గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌గౌడ్, రవి వాటర్ ఫిల్టర్‌ను హెచ్‌ఎం రాములుకు శనివారం అందించి ప్రారంభించారు. విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నందున ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉపాధ్యాయ బృందం రాము, రవి, సర్పంచ్ వసుందర, వెంకటేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. దాతలను వారు అభినందించారు.

ఎల్‌ఓసీ అందజేత

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన టంకసాని బాల్‌రాజ్‌కు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చొరవతో రూ. లక్ష విలువైన ఎల్‌ఓసీ మంజూరైంది. కాగా నాయకుడు దుశ్యంత్‌రెడ్డి శనివారం బంక వెంకటయ్య, శ్రీనివాస్, నర్సింహులు, సత్యం, మణికంఠ ద్వారా ఎల్‌ఓసీని బాధితుడికి అందజేయించారు.

వివాదాల 'ఎంపీడీఓ' బదిలీ

నవాబుపేట: ఎంపీడీఓ శ్రీలత ఎట్టకేలకు బదిలీపై వెళ్లారు. అందరిని ఆశ్చర్య పరిచేలా ఫారిన్‌సర్వీస్ తీసుకుని స్పోర్ట్స్‌వింగ్‌లో(స్పోర్ట్స్ అథారిటీ) ఆమె బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా మండలంలో ఆమె విధులు నిర్వహిస్తున్న తరుణంలో కార్యాలయ సిబ్బందితో తరుచూ వివాదాలు చోటుచేసుకునేవి. అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటనలు ఉన్నాయి. కులంపేరుతో దూషించారని ఉపాధిహామీ సిబ్బంది ఒకరు అప్పట్లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌లు సైతం అప్పట్లో ఎంపీ, ఎమ్మెల్యేలతో ఆమెతీరుపై మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇలా తరుచూ వివాదాలతో సాగుతున్న నేపథ్యంలో తాజా బదిలీతో వాటికి బ్రేక్ పడిందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు అభినందన



జడ్చర్ల టౌన్: విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు సాధించిన శ్లోక స్కూల్ విద్యార్థులను మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ మహమూద్ షేక్ శనివారం అభినందించారు. స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు త్రిష (టెంపరేచర్ కంట్రోల్డ్ ఆటోమేటిక్ ఫ్యాన్ తయారీ), అలీన(వెహికల్ ఇండికేటర్ ప్రాజెక్ట్)లను ప్రశంసించారు. ప్రిన్సిపాల్ ప్రతిభ, వైస్‌ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

పౌరపఠన కేంద్రాలతో మేలు

● ఏర్పాటుపై దృష్టి పెట్టండి
● జిల్లా వ్యాపంగా 50 కేంద్రాలు ఏర్పాటు చేయాలి
● అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో పౌరపఠన కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో శనివారం ఆయన 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పౌరపఠన కేంద్రాలతో మేలు జరుగుతుందని అన్నారు. పెద్ద గ్రామ పంచాయతీల్లో కేంద్రాల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా కనీసం 50 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలన్నారు. అందుకోసం ముఖ్యమైన గ్రామ పంచాయతీలను గుర్తించాలని అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ భవనంపై మరో రెండు పెద్ద హాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. గ్రంథాలయాల్లో మంచి సౌకర్యాలు కల్పించాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి పుస్తకాలు మ్యాగజైన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సెక్రటరీ మనోజ్‌కుమార్, డీపీఓ వెంకటేశ్వర్లు, పాలకవర్గం సభ్యులు గోవర్ధన్‌గౌడ్, వయోజన విద్య ఏపీఓ సుమాన్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లలో 5శాతం కేటాయించాలి


వినతిపత్రం సమర్పిస్తున్న దివ్యాంగులు

జడ్చర్ల టౌన్: నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 5శాతం దివ్యాంగులకు కేటాయించాలని వీహెచ్‌పీఎస్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు అన్నారు. శనివారం జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులు అందరూ నిరుపేదలేనని, డబుల్‌బెడ్‌రూంలకు అర్హులని వివరించారు. స్పందించిన తహసీల్దార్ దివ్యాంగుల సర్టిఫికెట్లు అందజేస్తే పరిశీలించి విచారిస్తామని వారికి వివరించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు బిచ్యానాయక్, జిల్లా అధ్యక్షుడు సుంకసారి చెన్నకేశవులు, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసులు, రాజశేఖర్, నవీన్, గోపాల్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్లా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి ఓపీఎస్‌ను అమల్లోకి తీసుకురావాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా అన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఎస్టీటీలను ప్రమోషన్‌లు, బదిలీలు చేపటాలని, 317 జీఓలో అన్యాయం జరిగిన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల జీపీఎఫ్‌లు, మెడికల్ బిల్లులు, ఈకుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులో వెంటనే విద్యావలంటీర్లతో నింపాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్, మహ్మద్‌అలీ, జగపతిరెడ్డి, రమేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టల తవ్వకం నిలిపేయండి


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నార్లోనికుంట్ల సర్పంచ్ తదితరులు


గుట్టను తవ్వడానికి ఏర్పాటు చేసిన హిటాచీ

దేవరకద్ర: నార్లోనికుంట్ల, బస్వాపూర్ శివారులోని రెట్టపేట గుట్ట ప్రాంతంలో జేసీబీలు, హిటాచీలను పెట్టి మట్టిని తవ్వి వందల ట్రిప్పులు అక్రమంగా అమ్ముకుంటున్నారని సర్పంచ్ రామాంజనేయులు, ఉప సర్పంచ్ నాగేశ్, మాజీ సర్పంచ్ రాఘవులు ఆరోపించారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని శనివారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన నాయకుడు ఈ తవ్వకాల ను సాగిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే గుట్ట సగభాగం గుంతలతో నిండి పోయిందని పేర్కొన్నారు.

నిందితులపై కేసు నమోదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

హన్వాడ: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కటౌట్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చివేయడంపై హన్వాడ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళ్తే చిన్నదర్పల్లిలో పలువురు నాయకులు ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కాగా ఈనెల 26న అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగలు దానికి నిప్పుపెట్టారు. గుర్తించిన స్థానిక నాయకులు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకె అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మిథున్‌రెడ్డిలకు విషయం తెలియజేశారు. వారి సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల బీజేపీ నాయకులు రఘురాంగౌడ్, అనిల్, అరుణ్, పవన్, కృష్ణయ్యగౌడ్, రాజుయాదవ్, పడమటి రాజు తదితరులు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు.

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సమయాన్ని సద్వినియోగం చేసుకొని పట్టుదలతో చదివి రానున్న పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం బీకేరెడ్డి కాలనీలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల బాలుర–1లో శనివారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో పొందే అనుభూతులు జీవితంలో ఎప్పుడూ వెంట ఉంటాయని అన్నారు. కళాశాల చదువు తర్వాత నాలుగేళ్లు కష్టపడితే మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని అన్నారు. మంచి మిత్రులతో స్నేహం చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గొప్ప స్నేహితుడు మన భవిష్యత్తుకు తోడ్పాటు అందిస్తాడని, మనం బాధలో ఉంటే భుజం తట్టి ఓదార్చుతాడని అన్నారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు లుబ్నా అల్‌జాబ్రి, అధ్యాపకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్యనాటక ప్రదర్శనలు ప్రారంభం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న పద్యనాటక ప్రదర్శనలు శనివారంప్రారంభమయ్యాయి. తొలి రోజు నాటకాల్లో శ్రీకృష్ణ రాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధం, అశ్వత్థామ ఏకపాత్రాభినయం, గయోపాఖ్యానం యుద్ధం ప్రదర్శనలు నిర్వహించారు. పాత్రధారులు తమ అభినయంతో ఎంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమిత్రకళానాట్య మండలి అధ్యక్షుడు వి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎంతో ప్రతిభ గల నాటక రంగ కళాకారులు ఉన్నారని పేర్కొన్నారు. పద్యనాటకాలను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ సహకారంతో పద్యనాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ రంగస్థల నటులు కె.జనార్దన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

కందులు @ రూ.9,649

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.9,649, కనిష్ఠంగా రూ.9,389గా నమోదయ్యాయి. సీజన్ లేకపోవడం వల్ల మార్కెట్‌లో లావాదేవీలు తక్కువ మొత్తంలో జరిగాయి.



ఆలయానికి రూ. లక్ష విరాళం



దేవరకద్ర: పుట్టపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి కౌకుంట్ల సర్పంచ్ స్వప్న, కిషన్‌రావు దంపతులు రూ. లక్ష విరాళం అందజేశారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ పెద్దలు, దేవస్థాన కమిటీ వారికి నగదు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, యాదవరెడ్డి, అనంతరెడ్డి, కొండన్న, శేఖర్, జానకి రాములు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'మీసేవ' కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



హన్వాడలో వినియోగదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిష్టానాయక్

హన్వాడ: మండలంలోని 'మీసేవా' కేంద్రాలను తహసీల్దార్ కిష్ట్యానాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చే అర్జిదారులకు కనీస వసతులైన తాగునీటితో పాటు 'మీసేవా' ధరల పట్టికను కనిపించేలా పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ధరల పట్టికలో ఉన్న రేటు ప్రకారమే రుసుం తీసుకోవాలని, సంబంధించిన రసీదులు ఇవ్వాలన్నారు. కుల, ఆదాయ, నివాసంతో పాటు వివిధ రకాల దరఖాస్తులను వెంటనే కార్యాలయానికి వచ్చేలా చూడాలన్నారు. మండల కేంద్రంతో పాటు టంకర, చిన్నదర్పల్లి, కొత్తపేటల్లోని మీసేవా కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన వినియోగదారులతో నేరుగా మాట్లాడారు. 'మీసేవ'లపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు కేంద్రాల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

'చెకుముకి'లో సత్తాచాటిన విద్యార్థులు


బాదేపల్లిలో టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. హెచ్‌ఎం చంద్రకళ ప్రారంభించారు. టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు వేదిక మండల కో ఆర్డినేటర్ మన్యం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు గోవింద్‌నాయక్, కృష్ణ, సునీల్, అలీమ్, శంకర్‌బాబు, గోపాల్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఆనంద్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అధ్యాపకులు లావణ్య, జన వి/జ్ఞాన వేదిక అధ్యక్షుడు అశోక్, వెంకటస్వామి, రమాదేవి, పరిమళ తదితరులు పాల్గొన్నారు.


మూసాపేటలో..

అడ్డాకుల: మండలంలోని ఎంఆర్‌సీ వద్ద చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించారు. అడ్డాకుల, పొన్నకల్, శాఖాపూర్, కందూర్, రాచాల, కన్మనూర్ జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియంలో పొన్నకల్ ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు జ్యోతి, కురుమూర్తి తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో కందూర్ విద్యార్థులు సత్తాచాటినట్లు వివరించారు. విద్యార్థులకు జేవీవీ సంబంధిత పుస్తకాలు, సర్టిఫికేట్లను పంపిణీ చేశారు.

మూసాపేట ఉన్నత పాఠశాలలో శనివారం పోటీలను నిర్వహించినట్లు ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. తెలుగు మీడియంలో పోల్కంపల్లి, ఇంగ్లీష్ మీడియంలో మూసాపేట విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు.

రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన చెకుముకి పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు సత్తాచాటి మొదటిస్థానంలో నిలిచారు. మండలస్థాయిలో విజయం సాధించిన వీరు వచ్చేనెల 3న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. రెండోస్థానంలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు నిలిచారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు శ్రీనివాసులు, మురళీకృష్ణ, అరుణశ్రీ, శ్రీధర్, వెంకటేష్, సతీష్‌రాథోడ్ పాల్గొన్నారు.


అడ్డాకులలో..


ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో

అంధవిశ్వాసాలను వీడండి


మాట్లాడుతున్న ఎంఈఓ రాజునాయక్

హన్వాడ: నిత్య జీవితంలో అంధ విశ్వాసాలను కాకుండా శాస్త్రీయ వైఖరిని కలిగి ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ వర్మ సూచించారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. ఎంఈఓ రాజునాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహను కలిగి ఉండాలని, సైన్స్‌పై ఆసక్తిని పెంచుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



చిన్నచింతకుంట: కురుమూర్తిలో గ్రామ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ మహిమూద్, అప్పంపల్లి సింగిల్‌విండో డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, నాయకులు విజ య సారథి రెడ్డి, జీజీపాల్, మహదేవన్‌గౌడ్,శేఖర్ పాల్గొన్నారు.

'సాగు'కు కరెంటు కష్టాలు

● డీడీలు కట్టినా విద్యుత్ సామగ్రి ఏర్పాటు చేయని అధికారులు
● కర్రల మీద నుంచి లైన్లు వేసుకొంటున్న రైతులు


పోమాల్ సమీపంలో కర్రలపై విద్యుత్ తీగలు

నవాబుపేట: మండల పరిధిలో పంటల సాగుకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా కరెంట్ కష్టాలు రైతులను వేధిస్తున్నాయి. అధికారులు వారికి సహకరించక పోవడమే ఇందుకు కారణమవుతోంది. డీడీలు కట్టినా విద్యుత్ సంబంధ సామగ్రి, స్తంభాలను ఏర్పాటు చేయడంలో వారు విఫలమవుతున్నారు. దీంతో కొంతమంది రైతులు కర్రలను పాతి వాటి మీదుగా విద్యుత్ లైన్లు వేసుకొంటున్నారు. ప్రమాదకరమైనప్పటికీ తప్పడం లేదని వాపోతున్నారు. విద్యుత్ అధికారులు సరిగ్గా స్పందించక పోవటంతో చాలా గ్రామాల్లో తమలాంటి రైతులు వ్యవసాయ పనులు చేస్తూ విద్యుత్ ప్రమాదంలో మృతి చెందారని వాపోతున్నారు. కాగా అధికారులు వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చినప్పుడు అన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. కానీ సామగ్రిని అందించి వైర్లు ఏర్పాటు చేయాల్సిన కాంట్రాక్టర్ వాటిని నిర్లక్ష్యంగా వదిలేయటంతో రైతులు చేసేది లేక కర్రమీద విద్యుత్ లైన్లు తీసుకొంటున్నారు. పోమాల్, దొడ్డిపల్లి, మెగుళ్ళపల్లి, మరికల్, కొల్లూర్, కాకర్లపహాడ్, కారుకొండా, చౌడూర్, కొల్లూర్ తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. మొత్తం 54 పంచాయతీలలో 7 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా దాదాపు12వేల పైచీలుకు కనెక్షన్లు ఉంటాయి. దాదాపుగా 27 వేల హెక్టార్ల భూమిలో బోర్ల నీటిపైన ఆధారపడి సాగు చేస్తున్నారు. వీరంతా కనెక్షన్ కోసం డీడీలు తీసీన వారే. కాగా వీరికి మొత్తం సామగ్రి సమకూర్చకపోవడం గమనార్హం. మండలం మొత్తం దాదాపుగా 9210 మంది రైతులు సంబంధిత శాఖ అనుమతి పొందిన వారు ఉంటారని .. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయంలో పల్లెప్రగతిలో గ్రామాల వారీగా వచ్చిన సమస్యలు గుర్తించినప్పటికీ ఎక్కడివక్కడే వదిలేశారు. ఒక్క సమస్య సైతం పరిష్కారం కాకపోవటంతో రైతులు నిత్యం గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మండలంలో గ్రామాల వారీగా 505 సమస్యలు గుర్తించినా చర్యలు మాత్రం శూన్యమని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎవరూ పట్టించుకోరు...

విద్యుత్ స్తంభాలకోసం ఎన్నిసార్లు తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్ వస్తాడు అంటారు కానీ ఒక్క పని చేయరు. దీంతో కర్రలపై వైర్లు లాగి సాగు చేస్తున్నాం. పలు సందర్భాల్లో పొలాల చెంత విద్యుత్‌ఘాతంతో మృతిచెందిన మూగజీవులకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా పరిహారం అందలేదు. –ఆంజనేయులు, నవాబుపేట

సామగ్రి కొరత ఉంది

మండలంలో రైతులకు సరిపడ సామగ్రి లేకనే ఇబ్బంది వచ్చి పడింది. వచ్చిన సామగ్రిని విడతల వారీగా అందిస్తున్నా అది సరిపోవటం లేదు. అనాధికార కనెక్షన్‌లతో చాలా ఇబ్బంది వస్తోంది. పల్లెప్రగతి పనులకు సంబంధించి 257 స్తంభాలు కావాల్సి ఉండగా 70 మాత్రమే వచ్చాయి. తాజాగా రూ. 1.40 కోట్ల విద్యుత్ సామగ్రి అవసరమని జిల్లా అధికారులకు వివరించాం. –సంతోష్, ఏఈ, నవాబుపేట

వివాహిత అదృశ్యం : కేసు నమోదు

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌కి చెందిన ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు సదరు మహిళ ఈనెల 21న మధ్యాహ్నం ఇంటి నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె భర్త గ్రామంలోనూ, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.